# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 100 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం 03, నవంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## బిసి రిజర్వేషన్లు ఖరారు చేశాకే ఎన్నికలు

**మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ సూచన**



హైదరాబాద్,నవంబర్2(నమస్తే ఉదయం): బిసి రిజర్వేషన్లు ఖరారు అయ్యాకనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని మాజీమంత్రి శ్రీనివాస గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లపై చట్టం చేస్తే సహకరిస్తామన్నారు. చట్టం లేకుండా రిజర్వేషన్లు పెరగవని పేర్కొన్నారు. బిహార్, మహారాష్ట్రలో రిజర్వేషన్ల పెంపును కోర్టులు కొట్టేశాయని గుర్తుచేశారు. ప్లానింగ్ కమిషన్, బీసీ కమిషన్‌పై ప్రభుత్వం 2 జీవోలు మాత్రమే ఇచ్చిందని మాజీ మంత్రి, భారాస నేత శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బీసీ కమిషన్ జిల్లాలకు పోతే ఎవరూ పట్టించుకోవడం లేదు. కమిషన్‌ను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దాన్ని నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

# బిజెపి రాష్ట్రాల్లో చీకట్లు..
# తెలంగాణలో వెలుగులు

- 11 నెలల్లోనే సంక్షమం, అభివృద్ధి పరుగులు
- 48 గంటల్లోనే రెండు వాగ్దానాలను నెరవేర్చాం
- 11 నెలల్లోనే దాదాపు 50వేల మంది యువతకు ఉద్యోగాలు
- బీఆర్ఎస్ దుష్పరిపాలనకు చరమగీతం పాడాం
- పేదలకు ఆరోగ్యశ్రీని పది లక్షలకు పెంచాం
- ప్రధాని మోడీ విమర్శలకు ఎక్స్ వేదికగా రేవంత్ ఘాటు సమాధానం

హైదరాబాద్, నవంబర్2(నమస్తే ఉదయం): కాంగ్రెస్ హయాంలో చీకట్లను తరిమేసి వెలుగులు నింపామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్ ఇలా తదితర అంశాలను వివరిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ విమర్శలకు ఘాటు సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఆనందం వెల్లువిరుస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే రెండు వాగ్దానాలను నెరవేర్చామని.. 11 నెలల్లోనే దాదాపు 50వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని సీఎం రేవంత్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రియమైన నరేంద్ర మోదీ జీ. నా రాష్ట్రం, నా ప్రభుత్వం గురించి మీరు చేసిన ప్రకటనలలో అనేక అపోహలు, అవాస్తవాలపై స్పష్టత ఇవ్వడానికి నేను సంతోషిస్తున్నాను. డిసెంబర్ 7న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో ఆనందం ఆశలు వెల్లువెత్తాయి. దశాబ్దం బీఆర్ఎస్ దుష్పరిపాలన పోయి ప్రజల్లో సంతోషం వెల్లివిరిసిందన్నారు. బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లోనే, తెలంగాణ ప్రభుత్వం మొదటి, రెండవ వాగ్దానాన్ని నెరవేర్చింది. అన్ని టీజీఎస్ఆర్టీసీ



బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రి కవరేజీని విడుదల చేసింది. గత 11 నెలల్లో తెలంగాణలోని సోదరీమణులు, తల్లులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ప్రయాణించారు. రాష్ట్రవ్యాప్తంగా 101 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారు. ఒక సంవత్సరంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం 3,433.36 కోట్లు ఖర్చు చేశాం. మా మొదటి సంవత్సరం పూర్తి కాకముందే,

మిగతా.. 2లో



## యూనివర్సిటీలను బలోపేతం చేయండి

- స్వేచ్ఛగా పనిచేసి మంచి పేరు తీసుకురండి
- కొత్తగా నియమితులైన విసిలకు సిఎం రేవంత్ సూచన

హైదరాబాద్,నవంబర్ 2(నమస్తే ఉదయం): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను సమూలంగా ప్రక్షాళన చేసి.. దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలని కొత్త వైఎస్‌ఛాన్సలర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా యూనివర్సిటీలను బలోపేతం చేసి, విద్యార్థుల్లో భరోసా కల్పించాల్సి ఉందన్నారు. యూనివర్సిటీలపై నమ్మకం పెంచాల్సిన తోణ బాద్యత తీసుకోవాలని అన్నారు. ఇటీవల ఆయా యూనివర్సిటీలకు కొత్తగా నియమితులైన ఉపకులపతులంతా కలసి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా

మిగతా.. 2లో

## దేశవ్యాప్తంగా కులగణన జరగాల్సిందే

- కాంగ్రెస్ దీనికి కట్టుబడి ఉంది
- కులగణనపై సలహాలు, సూచనలు తీసుకుంటాం
- సంక్షేమం అంటే కాంగ్రెస్ పార్టీ పేటెంట్
- కులగణన కారక్రమం కోసం 5న రాహుల్ రాక
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్



హైదరాబాద్,నవంబర్2(నమస్తే ఉదయం): దేశవ్యాప్తంగా కులగణన జరగాలన్నది తమ పార్టీ నిర్ణయమని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. నవంబర్ 5న బోయినపల్లిలోని మహాత్మా గాంధీ

మిగతా.. 2లో

## మరో నాలుగేళ్లు రేవంత్ రెడ్డే సిఎం



- తల తాకట్టు పెట్టయినా సరే ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేస్తాం
- నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు నిర్మిస్తాం
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మా ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకం
- మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిట్ చాట్

హైదరాబాద్,నవంబర్ 2(నమస్తే ఉదయం): మరో నాలుగేళ్లు తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి కొనసాగుతారని, సీఎం మార్పు అంటూ ఉండదని సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సీఎంను మారుస్తారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో పస లేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా తల తాకట్టుపెట్టయినా సరే ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేస్తామని, అది తమకు

మిగతా.. 2లో



## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో
# కార్తీక శోభ

**శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు**

**నదీస్నానాలకు ప్రాధాన్యం**

హైదరాబాద్,నవంబర్2(నమస్తే ఉదయం): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. శనివారం నుంచి కార్తీక ప్రవేశంతో శైవాలయాలు కిటకిటలాడాయి. అలాగే నదీతీరాలు, సముద్ర తీరాల్లో పవిత్ర స్నానాలకు ప్రజలు చేరుకున్నారు. నదీతీర శైవ క్షేత్రాలు కార్తికమాసం శోభను సంతరించుకున్నాయి. కార్తికమాసం తొలిరోజు కావడంతో శనివారం తెల్లవారుజాము నుంచి మహిళలు, భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మహాశివునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ముక్కంటి సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్నారు. భద్రాచలంలో పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. కార్తిక దీపాలు వదులుతున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణ మండపంలో కార్తిక పురాణ ప్రవచనం గావిస్తున్నారు. రాజన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం సామూహిక కార్తిక దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గోదావరి, కృష్ణా తీరంలోని శైవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వేకువజామునే స్వామివారిని దర్శించుకున్న భక్తులు, కార్తిక దీపాలు వెలిగించారు. కాగా, కార్తికమాసం సందర్భంగా భక్తుల కోసం పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నది. వివిధ డిపోల నుంచి అన్నవరం, కాళేశ్వరం, శ్రీశైలం, అరుణాచలం, వేములవాడతోపాటు ప్రసిద్ధ శివాలయాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటుచేసింది.

శ్రీశైలం, శ్రీకాళహస్తి, అన్నవరం, పట్టిసీమ, ద్రాక్షారామం, సామర్లకోట తదితర క్షేత్రాల్లో భక్తులు ఉదయం నుంచే దర్శనాలకు వచ్చారు.



## తారాస్థాయికి అమెరికా అధ్యక్ష ఎన్నికలు

- జాతీయ అందర్జాతీయ పరిణామాలపై ప్రకటనలు
- పోటాపోటీగా విమర్శలతో పదునెక్కుతున్న ప్రచారం

వాషింగ్టన్,నవంబర్2(నమస్తే ఉదయం): అమెరికా అధ్యక్ష ఎన్నికలు తారాస్తాయికి చేరుకున్నాయి. మరికొద్ద ఇరోజుల్లో ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో ప్రధాన అభ్యర్థులు ట్రంప్, కమలాహారిస్ ప్రచారం ఉధృతం చేశారు. తాజాగా దేశ ఆర్థిక విధానాలపై ప్రకటనలు చేస్తున్నారు. విదేవాంగ విధానంపైనా మాట్లాడుతున్నారు. అమెరికా

మిగతా.. 2లో



## 25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- కీలక బిల్లులు ఆమోదించే అవకాశం

న్యూఢిల్లీ,నవంబర్2(నమస్తే ఉదయం): పార్లమెంట్ శీతాకాల సమావేశాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 20 వరకూ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలిసింది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై ఈ శీతాకాల సమావేశాల్లో కీలకంగా చర్చించనున్నారు. వక్ఫ్ సవరణ బిల్లు 2024కు కూడా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోద ముద్ర పడే అవకాశం ఉంది. 'వన్ నేషన్, వన్

మిగతా.. 2లో



## మెట్రో రెండు దశకు గ్రీన్ సిగ్నల్

**పరిపాలనా అనుమతులు మంజూరు**

హైదరాబాద్,నవంబర్2(నమస్తే ఉదయం): హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు మార్గం సుగమమైంది. రెండో దశ నిర్మాణానికి రాష్ట్రం ప్రభుత్వం పరిపాలనా అనుమతులను జారీ చేసింది. ఈ రెండో దశలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుమతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవోను జారీ చేసింది. ఇందులో నాగోల్ నుంచి శంషాబాద్, ఎల్‌బి నగర్ నుంచి హయత్ నగర్, రాయదుర్గం నుంచి

మిగతా.. 2లో

## అప్పుడు బీఆర్ఎస్ వాళ్లకు అహంకారం ఉంది

- నేను నోరు విప్పితే ఇబ్బంది పడేది బీఆర్ఎస్ నాయకులే
- మా వల్లే జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు
- మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ ప్రణాళికలు వేయలేదా?
- హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్,నవంబర్2(నమస్తే ఉదయం): "నేను నోరు విప్పితే బీఆర్ఎస్ వాళ్లు ఇబ్బంది పడతారు. నాటి విషయాలన్నీ నేను ఇప్పుడు బయట పెట్టాలా? మూసీ ప్రక్షాళన కోసం అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ కూడా

మిగతా.. 2లో

## కేంద్రం లెక్కలు చూసైనా బుద్ధి తెచ్చుకోండి

- నేడు గొర్ల పంపిణీ లేక - చేప పిల్లల పంపిణి నిలిపేసి కుల వృత్తులను రూపుమాపే కుట్ర
- 'ఎక్స్' వేదికగా రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్




హైదరాబాద్,నవంబర్2(నమస్తే ఉదయం): పంటల దిగుబడిలోనే కాదు..పశు సంపదలోనూ గత పదేళ్లూ పండగే. కులవృత్తులకూ కేసిఆర్ కొండంత అండగా నిలవడం వల్లే పశుసంపదలోనూ గణనీయ వృద్ధి. గ్రామీణ తెలంగాణలో ఉపాధి

మిగతా.. 2లో

## ప్రజాపాలన అంటే ప్రతిపక్షం గొంతు నొక్కడమా?

- ప్రశ్నిస్తే కేసులు పెట్టి బెదిరిస్తారా
- శ్రీనివాస్ గౌడ్ తదితరులపై కేసులు దారుణం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్,నవంబర్2(నమస్తే ఉదయం): ప్రజాపాలన అంటే ప్రజా సమస్యల పట్ల పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా అని సిద్ధిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కేసులు కొత్త కాదని, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరుపున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. తమ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను

మిగతా.. 2లో

# తారాస్థాయికి అమెరికా అధ్యక్ష ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్ష ఎన్నికల్లో తాను విజయం సాధించి అధికారంలోకి వస్తే దేశంలో సరికొత్త ఆర్థిక అద్భుతాన్ని సృష్టిస్తానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మిచిగాన్‌లోని డెట్రాయిట్‌లో జరిగిన ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడుతూ డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ ఆర్థిక విధానాల్లో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. ఆమె విఫల ఆర్థిక అజెండా కారణంగా ఇటీవలే ప్రైవేటురంగంలో 30 వేల ఉద్యోగాలు తుడిచిపెట్టుకుపోయాయ న్నారు. తయారీరంగంలోనూ దాదాపు 50వేల ఉద్యోగాలు కోల్పోయామని పేర్కొన్నారు. హారిస్ అధికారంలోకి వస్తే ఆర్థికవ్యవస్థ విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. 'హారిస్ విధానాలు దేశాన్ని నాశనం చేసేలా ఉన్నాయి. వాటివల్ల అమెరికన్ కార్మికులు మునిగిపోతున్నారు. ఆమె ఒక రాడికల్ లెఫ్ట్ మార్క్సిస్ట్, ఎలఇని రద్దు చేస్తానని, మా తుపాకులు జప్తు చేస్తానని ప్రతిజ్ఞ చేసింది. కాని నేను మాత్రం దేశంలో ఉన్న ద్రవ్యోల్బణాన్ని అంతం చేస్తానని, పన్నులు తగ్గిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వేలకొద్దీ కర్మాగారాలను అభివృద్ధి చేస్తాను. నా పాలనలో హింసాత్మక నేరాలు జరగకుండా అణచివేస్తాను' అని పేర్కొన్నారు. దేశ సమస్యలే కాకుండా ప్రపంచదేశాల పరిస్థితులను నిరంతరం గమనిస్తుంటానని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను నివారించడానికి, రష్యా- ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నిస్తానన్నారు. మూడో ప్రపంచయుద్ధం రాకుండా నిరోధిస్తానని హామీ ఇచ్చారు. అమెరికా సైన్యాన్ని బలోపేతం చేయడానికి, ఆధునికీకరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని ట్రంప్ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద క్షిపణి రక్షణ కవచాన్ని నిర్మిస్తామన్నారు. పిల్లలు, యువతకు దేశాన్ని, మన చరిత్రను, జెండాను గౌరవించడం నేర్పిస్తానన్నారు. జెండాను అగౌరవపరిచినవారికి ఒక ఏడాది జైలు శిక్ష విధిస్తానని పేర్కొన్నారు. దేశ పౌరుల మతపరమైన స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యాన్ని పునరుద్ధరిస్తానన్నారు.

దేశ సరిహద్దులను కాపాడుకుంటూ అక్రమ వలసలను నివారిస్తామని ట్రంప్ అన్నారు. ఇకపోతే ట్రంప్ విధానాలను కమలా ఎండగుడుతున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా ప్రజల్లో విద్వేషాలు రేకెత్తిస్తున్నారని డెమోక్రాటిక్ అభ్యర్థి కమలాహారిస్ అన్నారు. అమెరికాకు ట్రంప్ కంటే మెరుగైన అధ్యక్షుడు అవసరమని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇక్కడి ప్రజల పాత్ర, బాధ్యతలను అర్థం చేసుకొనే వ్యక్తి వారికి కావాలని, ప్రపంచానికే ఆదర్శంగా కనిపించే నాయకుడు అమెరికా అధ్యక్షుడిగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. కానీ ట్రంప్ అమెరికన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కాకుండా తన రాజకీయ ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకోవడంపై దృష్టిపెడతారని హారిస్ అన్నారు.

# 25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎలక్షన్' ప్రతిపాదన, వక్ఫ్ సవరణ బిల్లు.. ప్రధానంగా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ రెండు అంశాల చుట్టూనే వాడీవేడిగా సాగనున్నాయి. 'వన్ నేషన్ -వన్ ఎలక్షన్' ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం 18 రాజ్యాంగ సవరణలను ఈ హైలెవల్ కమిటీ సిఫార్సు చేసింది. కాగా, వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకుంటామని 15 విపక్ష పార్టీలు ఇప్పటికే హెచ్చరించాయి.దేశంలోని ఓటర్లు అందరూ లోక్ సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒకేసారి ఓటు హక్కును వినియోగించు కోవడం. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఒకే సమయంలో కాకపోయినా... ఒకే ఏడాదిలో ప్రజలు ఓటేస్తారు.

# మరో నాలుగేళ్లు రేవంత్ రెడ్డే సిఎం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిష్ఠాత్మకమని చెప్పారు. మరో నాలుగేళ్లు రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రి. రాష్ట్రంలో సిఎం మార్పు అనేది ఉండదు. మరో నాలుగు సంవత్సరాల ఒక నెల రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. కాంగ్రెస్ పార్టీ రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుంది. ప్రతిపక్షం కాబట్టి ఏదో ఒకటి మాట్లాడాలని మాట్లాడుతోంది.

రాష్ట్రంలో ఈనెల 5, 6 తేదీల నుంచి ఇందిరమ్మ ఇండ్ల లబ్ది దారుల ఎంపిక 15రోజుల్లో గ్రామ కమిటీల ద్వారా ఎంపిక పూర్తి చేసి ఆ వెంటనే జాబితాల ఖరారు.ఇది నిరంతర ప్రక్రియ. గ్రామాలలో ఇందిరమ్మ కమిటీల ఎంపికే ఫైనల్.

ఇండ్లు మహిళల పేరిటే మంజూరు. లబ్దిదారులే సొంతంగా ఇండ్లు నిర్మించుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఎటువంటి రాజకీయ జోక్యం ఉండదు. నిరుపేదలకు తొలి ప్రాధాన్యత. పేదరికమే ప్రామాణికంగా లబ్దిదారుల ఎంపిక. లబ్దిదారుల ఎంపికలో ప్రత్యేక యాప్ దే కీలకపాత్ర, అందుకే ఇంత సమయం పట్టింది.

ఆధార్‌తో సహా అన్నివివరాలు యాప్ లో పొందుపరుస్తారు. 4 రాష్ట్రాలలోని ఇండ్ల నిర్మాణానికి సంబంధించి వివరాలు సేకరించి ముందుకు వెళ్తున్నాం. ఇండ్ల నిర్మాణంలో ఎటువంటి డిజైన్లు ఉండవు. లబ్దిదారుల ఇష్టం మేరకు ఇల్లు నిర్మించుకోవచ్చు. కనీసం 400 చదరపు గజాలు తగ్గకుండా లబ్దిదారుడు ఇల్లు నిర్మించుకోవాలి.

నిర్మాణ దశల వారీగా లబ్దిదారులకు చెల్లింపులు. పునాదికి లక్ష, గోడలకు లక్షా 25వేలు, శ్లాబ్‌కు లక్షన్నర, పూర్తయితే లక్ష రూపాయిల చొప్పున చెల్లింపు. బ్యాంకు అకౌంట్ ద్వారానే చెల్లింపులు. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని మిగిలిన మొత్తాన్ని రాష్ట్రం భరిస్తుంది. నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు నిర్మిస్తాం. ప్రతి నియోజక వర్గంలో కనీసం 3500 ఇండ్లు నిర్మించేలా చూస్తాం.

ఇండ్లలో తప్పనిసరిగా వంటగది, బాత్రూం నిర్మించుకోవాలి. ప్రతి మండలంలో కనీసం ఒకరు లేదా ఇద్దరు ఎఈ లు ఉండేలా చర్యలు.

16 శాఖలకు చెందిన వారిని సమీకరించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తాం. ఒకే గొడుగు నీడన ఇంజనీర్ల పర్యవేక్షణలో ఇండ్ల నిర్మాణం జరిగేలా చర్యలు ప్రభుత్వం తరపున 5 లక్షల సాయం ఇస్తాం, లబ్దిదారులు ఆర్థిక పరిస్థితి బట్టి ఇంకా కట్టుకోవచ్చు. దేశంలో తెలంగాణ మాత్రమే ఇంతటి భారీ గృహ నిర్మాణం చేపట్టి, 5 లక్షల సాయం అందిస్తోంది.

గత ప్రభుత్వంలో నిలిచిపోయిన సుమారు 600 -800 ఇండ్ల నిర్మాణానికి కూడా సహకరిస్తాం. తొలి విడత గా సుమారు 28 వేల కోట్ల రూపాయిల వరకు కోట్లు ఖర్చు కావచ్చు. సుమారు 7,740 కోట్ల రూపాయిలను ఇందిరమ్మ ఇండ్లకు బడ్జెట్‌లో కేటాయించాం. అవసరమైన నిధుల కోసం కేంద్రాన్ని కోరుతాం, నిధులను వివిధ మార్గాలద్వారా సమీకరిస్తాం.

పునాది పూర్తయిన వెంటనే తొలివిడత నిధుల విడుదల. నిర్మాణాలు జరిగేలోగా మళ్లీ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరుగుతుంది. స్మార్ట్ కార్డుల ఆధారంగా లబ్దిదారుల ఎంపిక. అర్హులైన వికలాంగులకు ప్రాధాన్యత ఇస్తే మంచిదే. గ్రామ కమిటీలదే తుది ఎంపిక. నందనవనం, మంకాల్ ఇండ్ల సమస్యకు త్వరలో పరిష్కారం.

ఇండ్ల స్థలాలు లేనివారికి 2 వదశలో స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తాం. కేంద్రప్రభుత్వ నిబంధనల ప్రకారం, 75 నుంచి 80 గజాల స్థలాన్ని సమకూర్చి ఇస్తాం. ఎక్కడైనా కొత్తగా ఇందిరమ్మ కాలనీలు ఏర్పడితే కరెంట్, రోడ్లు , డ్రైనేజ్ తదితర మౌళిక వసతులను ప్రభుత్వమే సమకూరుస్తుంది.

గత ప్రభుత్వం మూసివేసిన హౌసింగ్ శాఖను పునరుద్ధరిం చాము. ఎన్నికల వరకే రాజకీయాలు, ఎలాంటి భేషజాలకు పోవడం లేదు. కేంద్రం ఎంతిచ్చినా తీసుకుంటాం, ఏమీ ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తాం, మాకు ఇగోలు లేవు. గత ప్రభుత్వం ధనిక రాష్ట్రమని చెప్పి కేంద్రాన్ని ఇండ్లు అడగలేదు.

డబుల్ బెడ్ రూం ఇండ్లలో నీళ్లు, కరెంట్, డ్రైనేజ్ వంటి వసతులేవు. మేము అవన్నీ కల్పించి లబ్దిదారులకు అప్పగిస్తున్నాం. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో 19.36 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడం జరిగింది.

# మెట్రో రెండు దశకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

నియో పోలీస్, మియాపూర్ నుంచి పటాన్‌చెరు కారిడార్లు ఉన్నాయి. మెట్రో రెండో దశకు అంచనా వ్యయం రూ. 24,269 కోట్లు.గా ఉంటుందని భావిస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 7, 313 కోట్లు. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో మూడు కారిడార్లలో కలుపుకుని మొత్తం 69 కిలోమీటర్ల మేర నిర్మాణం జరిగింది. మొదటి దశ ప్రాజెక్టుకు రూ. 22 వేల కోట్లు ఖర్చైంది. హైదరాబాద్ మెట్రో ద్వారా ప్రస్తుతం రోజుకు దాదాపు 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రెండో దశ కూడా అందుబాటులోకి వస్తే రోజుకు మరో 8 లక్షల మంది మెట్రోలో ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రెండో దశ నిర్మాణ పనులు అయిదు కారిడార్లలో మొత్తం 76.4 కిలో మీటర్ల మేర జరగనున్నాయి. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు పీపీపీ విధానంలో మెట్రో రెండో దశ పనులు జరగబోతున్నాయి. ఈ భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 30 శాతం అంటే రూ. 7, 313 కోట్లు. కేంద్ర ప్రభుత్వం వాటు 18 శాతం అంటే 4,230 కోట్లు. మిగిలిన 52 శాతం నిధులను రుణాలతో పాటు పీపీపీ విధానంలో సమకూర్చుతారు. అలాగే కొత్తగా నిర్మించబోయే ఫ్యూచర్ సిటీకి కూడా ఇందులో ప్రణాళిక చోటుచేసుకుంది.

# దేశవ్యాప్తంగా కులగణన జరగాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఐడియాలాజీ సెంటర్‌లో కులగణనపై సలహాలు, సూచనల కోసం నిర్వహించే కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్?ఖర్గే పాల్గొంటారని పేర్కొన్నారు. కులగణన పక్రియకు సంబంధించిన వివరాలు తెలుసుకుంటారని చెప్పారు. గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. 'సీఎం రేవంత్ రెడ్డి ఉండగా మళ్లీ కొత్త ముఖ్యమంత్రి ప్రస్తావన ఎందుకు వస్తుందన్నారు. తెలంగాణ ప్రజల నమ్మకానికి అనుగుణంగా మేం ప్రజా పాలన అందిస్తున్నం. బీజేపీలో మహేశ్వర్ రెడ్డికి గౌరవం లేదు. ఆయనకు అక్కడ కనీసం సీటు కూడా లేదు. కిషన్ రెడ్డికి, మహేశ్వర్ రెడ్డికి పచ్చి గడ్డి వేస్తే భగ్గుమంటుందని అంటారు. పక్క పార్టీల గురించి మేం మాట్లాడం. కాంగ్రెస్ లో ఉన్న ప్రజాస్వామ్యం.. స్వేచ్ఛ వేరే పార్టీలో ఉండదు. ప్రధాని మోదీ ఇస్తానన్న సంక్షేమ పథకాలు.. ఉద్యోగాలు ఏవి..? సంక్షేమం అంటే కాంగ్రెస్ పార్టీ పేటెంట్. పీసీసీ తరుపున అన్ని పార్టీలను పిలిచి ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించి సలహాలు తీసుకుంటాం. కుల గణన సర్వే ఎక్కడ బ్రేక్ లేకుండా జరగాలి అనేదే ప్రభుత్వం ఆలోచన. కేసీఆర్ కి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్ ఎందుకు బయటపెట్టలేదఅని ప్రశ్నించారు.

# ఉత్తర సెర్బియాలో ఘోర ప్రమాదం

## రైల్వే స్టేషన్ పైకప్పు కూలి 14 మంది మృతి

**న్యూఢిల్లీ,(నమస్తే ఉదయం):** ఉత్తర సెర్బియాలో ఘోర ప్రమాదం జరిగింది. రైల్వే స్టేషన్ పైకప్పు కుప్పకూలి పోవడంతో 14 మంది మృతి చెందారు. శుక్రవారం నోవి సాడ్ రైల్వే స్టేషన్ కాంక్రీట్ పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో ఒక చిన్నారి, ఓ విదేశీయుడు సహా కనీసం 14 మంది మరణించి నట్లు అధికారులు తెలిపారు. పలువురు గాయ పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో చాలా మంది శిథిలాల కింద చిక్కుకున్నారని.. వారిని రక్షించేందుకు రెస్క్యూ టీమ్ శ్రమిస్తున్నారని అధికారులు చెప్పారు. బయటకు తీసుకొచ్చిన పలువు క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనా స్థలంలో 80 మంది రెస్క్యూ వర్కర్లు శిథిలాలను తొలగిస్తున్నారని,



మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని మంత్రి ఐవికా డాసిక్ వెల్లడించారు.

# కార్తీకంలో శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

## పౌర్ణమి సందర్భంగా అరుణాచాలనికి స్పెషల్ సర్వీస్

## ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ వెల్లడి



**హైదరాబాద్,(నమస్తే ఉదయం):** కార్తిక మాసంలో ప్రసిద్ధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. శ్రీశైలం, వేములవాడ, ధర్మపురి, కీసరగుట్ట తదితర దేవాలయాలకు హైదరాబాద్ నుంచి స్పెషల్ బస్సులను నడుపుతున్నామని పేర్కొన్నారు. ఆది, సోమవారాలు శైవక్షేత్రాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆర్టీసీ పనితీరు, కార్తికమాసం ఛాలెంజ్, శబరిమల ఆపరేషన్స్, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై హైదరాబాద్ బస్‌భవన్ నుంచి ఉన్నతాధికారులతో ఆయన దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీకి కార్తిక మాసం, శబరిమల ఆపరేషన్స్ ఎంతో కీలకమని, భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. ఈ నెల 15న కార్తిక పౌర్ణమి నేపథ్యంలో తమిళనాడులోని అరుణాచలం వెళ్లే భక్తులకు ప్రత్యేక ప్యాకేజీ అందిస్తున్నామని సజ్జనార్ తెలిపారు. ఏపీలోని పంచారామ క్షేత్రాలకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను బిణబసబిఇశిబీబ.తిని వెబ్‌సైట్‌లో చేసుకోవాలని సూచించారు. మరిన్నీ వివరాలకు ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలన్నారు. బస్ ఆన్ కాంట్రాక్ట్ ఛార్జీలు తగ్గించినట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు.

# కేంద్రం లెక్కలు చూసైనా బుద్ధి తెచ్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

పెంచాలనే తపన, సంపద సృష్టిలో అందరినీ భాగస్వామ్యం చేయాలనే తాపత్రయం. తెలంగాణలో ఉన్న డిమాండ్ తగ్గట్టుగా.. ఇక్కడే మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు పెంచే ప్రయత్నం. ఇతర రాష్ట్రాల నుంచి ప్రతినిత్యం వచ్చే వందలాది లారీల దిగుబడికి పదేళ్లలో కళ్లెం. ప్రతి ఆలోచన వెనక.. ఒక సుదీర్ఘ అధ్యయనం. కేసిఆర్ లక్ష్యం.. ఆరోగ్య తెలంగాణ నిర్మాణం.పదేళ్లలో (2000)వేల కోట్ల వృద్ధి జరిగిందని కేంద్రం ప్రకటించడం సంతోషం. ఈ అద్భుత స్కీములను.. స్కాములు అని.. దుష్ప్రచారం చేసిన దుర్మా ర్గులు.. ఇకనైనా తీరు మార్చుకోవాలి. కళ్లముందు ఆవిష్కృతమైన ఈ అద్భుతాలను చూసి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి. కానీ నేడు గొర్ల పంపిణీ లేక - చేప పిల్లల పంపిణి నిలిపేసి కుల వృత్తులను రూపుమాపే కుట్రలు చేస్తున్న పాలకులారా.. కేంద్ర లెక్కలు చూసైనా బుద్ధి తెచ్చుకోండి. జై తెలంగాణ.

# ప్రజాపాలన అంటే ప్రతిపక్షం గొంతు నొక్కడమా?

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు.

పేదల ఇండ్లు ఎందుకు కూలగొట్టారని ప్రశ్నించినందుకు కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై తన కుటుంబ సభ్యులతోపాటు పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టినంత మాత్రానా భయపడేది లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హన్వాడ మండల కేంద్రంలో 60, 70 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టేందుకు జాబితాలు సిద్ధం చేసినట్టు తెలిసిందని ఏ ఒక్కరూ భయపడవద్దని మీకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చారు.

వరద భాస్కర్ ఇంటికి పోతే అతనిని పోలీస్ వాళ్లు కొట్టారని బాధపడితే అడుగుదామని పోతే సీఐ లేరంటే కింద కూర్చున్నాం.. దానికి కూడా కేసు నమోదు చేసారా అంటూ ప్రశ్నించారు. కూలగొట్టిన దివ్యాంగుల ఇండ్లను కట్టివ్వమని కోరినం అదికూడా తప్పా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అప్పన్నపల్లి బ్రిడ్జి నిర్మాణం రెండేండ్లలో పూర్తి చేశాం, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని పెద్ద దవాఖాన నిర్మాణం చేశాం. వీటిపై అసత్య ప్రచారాలతో ఎన్నికల్లో ఓడించారు. ఇప్పటికీ అదే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. పేదల పక్షాన అడుగుతున్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమాల్లో అనేక కేసులు నమోదు చేసినా జంకలేదు. ఇప్పుడు మీరు పెట్టే కేసులకు బెదిరిపోతామా.. మీ బండారాన్ని బయటపెట్టేందుకు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు.

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అధికారులు, పోలీసులు కూడా గుర్తెరిగి ప్రవర్తించాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

# అప్పుడు బీఆర్ఎస్ వాళ్లకు అహంకారం ఉంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికలు వేయలేదా? బీఆర్ఎస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాల"ని హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత, అసదుద్దీన్ ఒవైసీ హెచ్చరించారు. బీఆర్ఎస్ విధానాలు స్థిరంగా ఉండాలని, జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ పార్టీకి ఎక్కువ సీట్లు రావడానికి తామే కారణమని, మజ్లిస్ మద్దతు కారణంగానే ఆ పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చాయని అన్నారు. ఎన్నికల సమయంలో కేవలం 24 మందిని మార్చి ఉంటే బీఆర్ఎస్ గెలిచి ఉండేదని, కానీ అప్పుడు బీఆర్ఎస్ వాళ్లకు అహంకారం ఉందని అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు.

ఎక్కువ మంది సంతానం ఉండాలని తమిళనాడు సీఎం స్టాలిన్, ఏపీ సీఎం చంద్రబాబు, చెబుతున్నారని.. కానీ అదే విషయాన్ని తాను చెబితే మాత్రం రాద్ధాంతం చేసేవారన్నారు. బాగా పని చేస్తున్న రాష్ట్రాలను ప్రోత్సహించకుండా శిక్షిస్తే ఏం లాభమని ఒవైసీ మండిపడ్డారు. జనాభా ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదికి తీవ్రనష్టం జరుగుతుందని, అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గుతుందన్నారు.

మూసీపై బీఆర్ఎస్ ప్రణాళిక చేస్తే తాను వద్దని కూడా చెప్పానని, ఆనాటి విషయాలు ఇప్పుడు బయటకు చెప్పమం టారా? నేను నోరు విప్పితే ఇబ్బంది పడేది బీఆర్ఎస్ నాయకులే అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇళ్లను కూల్చకుండా ప్రక్షాళన చేస్తే స్వాగతిస్తామని ఒవైసీ అన్నారు.

# యూనివర్సిటీలను బలోపేతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

సీఎం మాట్లాడుతూ.. కొంతకాలంగా యూనివర్సిటీల పై నమ్మకం తగ్గుతోందని, మళ్లీ విశ్వాసం పెంచేలా పనిచేయాలన్నారు. వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని ఉపకులపతులకు సీఎం సూచించారు. యూనివర్సిటీల్లో ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం కోసం అవసరమైతే కన్సల్టెన్సీలను నియమించుకొని నివేదిక తయారు చేసుకోవాలని అన్నారు. ఒత్తిళ్ల ప్రభావంతో




వీసీలను నియమించలేదని.. ప్రతిభ, సామాజిక సమీకరణలనే పరిగణనలోకి తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వీసీలు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని.. తప్పులు చేస్తే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంచి పని చేయడానికి వైస్ ఛాన్సలర్లకి స్వేచ్ఛ.. ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో వీసీలను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునే వారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని సీఎం వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టాలని.. విద్యార్థులను గమనిస్తూ అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# బిజెపి రాష్ట్రాల్లో చీకట్లు.. తెలంగాణలో వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

మేము రైతులకి భరోసా ఇస్తూ రైతు రుణమాఫీని అమలు చేశాం. 22 లక్షల 22 వేల మంది రైతులు ఇప్పుడు ఎలాంటి రుణం లేకుండా, రాజులా జీవిస్తున్నారు. రూ. 2,00,000 వరకు రైతుల రుణాలన్నీ మాఫీ చేయబడ్డాయి. 25 రోజుల్లో 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశాం' అని సీఎం చెప్పుకొచ్చారు. ఇళ్లకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఛార్జీ లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీంతో మహిళలు మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉంటే, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో కేవలం రూ.500 కే సిలిండర్ లభిస్తుండడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా హయాంలో ఇప్పటివరకు 1.31 కోట్లకు పైగా గ్యాస్ సిలిండర్ రీఫిల్‌లు జరిగాయి. 42,90,246 మంది లబ్దిపొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యువత కోసం ఉద్యోగ నియామకాలను చేపట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించింది. అన్ని స్థాయిల పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలను 11 నెలల కంటే తక్కువ సమయంలో నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం 50,000 మంది అర్హులైన యువతకు ఉద్యోగాలు కల్పించింది. ఇది ఏ బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం చేయని రికార్డు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంగా పాఠశాల విద్యార్థులను విస్మరించింది. దశాబ్దం తర్వాత సంక్షేమ హాస్టళ్లలో పేద పిల్లలకు మెస్, కాస్మోటిక్ చార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. గతంలో నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని శుభ్రం చేసి పునర్వైభవం తీసుకొస్తున్నాం. గత 10 ఏళ్లలో ఆక్రమణలకు గురై, ధ్వంసం చేసిన మా సరస్సులు, నాలాలు విలువైన నీటి వనరులను కూడా మేము పరిరక్షిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క అంగుళం సరస్సు కూడా ఆక్రమణకు గురికాలేదు. అలాగే మేము ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నాం. మేము యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, జఎ స్పోర్ట్స్ యూనివర్శిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల కోసం బాల్ రోలింగ్‌ను సెట్ చేశాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానంపై పవిత్రమైన నిబద్ధతతో ఉన్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు.గత 11 నెలల్లో మేము తెలంగాణలో చీకట్లను పారద్రోలి వెలుగులను నింపాం' అని రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.ప్రధాని మోదీ విమర్శలకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు.





# హైదర్‌గూడలో ఘనంగా దీపావళి సదర్ ఉత్సవాలు

**రాజేంద్రనగర్, నవంబర్ 2(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడలో యాదవ సోదరులు దీపావళి పురస్కరించుకొని సదరు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్గూడా శ్రీకృష్ణ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదర్ ఉత్సవం ఎంతో ఆనంద ఉత్సవాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మీద పార్టీలు చెందిన రాజకీయ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి, కొండ మీ హరినాథ్, శెట్టి గారి నరేందర్, బండారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# షాట్‌పుట్‌లో జోనల్ స్థాయికి ఎంపికైన కేజీబివి విద్యార్థిని

**గద్వాల్, నవంబర్ 2(నమస్తే ఉదయం):** గద్వాల ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన అథ్లెటిక్స్ ఎస్ జి ఎఫ్ అండర్ 17 బాలికల విభాగంలో షాట్ పుట్‌లో కేజీబివి కేటిదొడ్డి విద్యార్థిని అలేఖ్య




సర్టిఫికెట్‌తో ఎంపికైన అలేఖ్య

జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి జోనల్ స్థాయికి ఎంపికైనట్లు ఎస్ఓ పద్మ, పీఈటి అరుణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# రామకృష్ణాపురం గ్రామంలో ఘనంగా దీపావళి పండుగ

**కొత్తకోట, నవంబర్ 2(నమస్తే ఉదయం):** మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో దీపావళి పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శనివారం దీపావళి పండుగ సందర్భంగా


శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

శ్రీ వేణుగోపాల స్వామి వారి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మూలమల్ల భీమ్ రెడ్డి , మాజీ సర్పంచ్ బుచ్చన్న రైతులు యువకులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోండి

## నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

**రాజేంద్రనగర్,నవంబర్ 02(నమస్తే ఉదయం):** విద్యుత్ వినియోగదారులు తమ ప్రాంతాలలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు ఈశ్వర




ప్రసాద్, శ్రీనివాస్, సత్యనారాయణలు సూచించారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి, ఫిష్ బిల్డింగ్, శంషాబాద్ విద్యుత్ కార్యాలయాలలో అధికారులు ఏర్పాటు చేసిన వేదిక వద్ద వినియోగదారులు తమ ప్రాంతాలలో ఉన్న సమస్యలను వివరించాలని అధికారులు కోరారు. ఈ వేదికలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన హైకోర్టు న్యాయవాది సుమ రెడ్డి

**గద్వాల, నవంబర్2(నమస్తే ఉదయం):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని హైకోర్టు న్యాయవాది సుమ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మురళి, నాయకులు ధర్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి పూల మొక్కలు అందజేస్తున్న న్యాయవాది సుమ రెడ్డి



రాజేంద్రనగర్ లో ఉద్యాన విద్యార్థులు వేసిన ఉద్యాన పంటల చిత్రాలను తిలకిస్తున్న వైస్ ఛాన్స లర్ డాక్టర్ దండ రాజి రెడ్డి


శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైస్ ఛాన్స లర్ డాక్టర్ దండ రాజి రెడ్డి

# ఉద్యాన విద్యార్థులకు 100% ఉపాధి కల్పించడమే ధ్యేయంగా విద్యల్లో మార్పులు

## తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి

**రాజేంద్రనగర్, నవంబరు 2(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యాన విద్యార్థులకు 100% ఉపాధి కలిగించేలా, నైపుణ్యత పెంపొందించడమే ధ్యేయంగా ఉద్యాన విద్యలో మార్పులు తీసుకొస్తామని వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి అన్నారు. శిక్షణ , నైపుణ్యం విద్యార్థులు సహజ కవచాలుగా ఏర్పరచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పారిశ్రామికీకరణ ఆధారత ఉద్యాన పంటలను సైతం ప్రోత్సహిస్తామని తెలిపారు. యూనివర్సిటీ ఇతర పరిశ్రమలు తో కలిసి విద్యార్థులకు మేలైన అవకాశాలు పెంపొందించేందుకు ప్రణాళికలు చేపడుతుందని తెలిపారు. అలాగే పొంచి ఉన్న పర్యావరణ మార్పుల నేపథ్యంలో ఉద్యాన పంటలపై జరిగే నష్టాన్ని తగ్గించేందుకు ఉద్యాన శాస్త్రవేత్తలు కృషి చేయాలని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి పిలుపునిచ్చారు. పరిశోధక విద్యార్థులే విశ్వవిద్యాలయం వెన్నుముక అని ఆయన అన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో రైతులు, శాస్త్రవేత్తలతో ఉద్యాన పంటల వారీగా సదస్సులు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలోని రాజేంద్రనగర్‌లో గల ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో వైస్ ఛాన్సలర్ విద్యార్థులు, శాస్త్రవేత్తలతో ఏర్పాటు చేసిన ముఖాముఖికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

### ఉద్యాన రంగానికి అపార భవిష్యత్తు :

తెలంగాణ రాష్ట్రంలో కేవలం 12.8 లక్షల ఎకరాల ఉద్యాన పంటల విస్తీర్ణంతో 25 శాతం జిఎస్టిపి కాంట్రిబ్యూట్ చేస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర ఉద్యన రంగానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రిస్కుతో కూడుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఉద్యాన రంగంలో ఉన్న రైతుల సమస్యలు తీర్చేందుకు ఉద్యాన విశ్వ విద్యాలయం కట్టుబడి ఉందని విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు.

### ఫ్యాన్సీ పరిశోధనలు వద్దు :

కేవలం సెన్సేషన్ కోసం పరిశోధనలు చేపట్టవద్దని నిపుణులను, శాస్త్రవేత్తలను కోరారు. పరిశోధన ఫలితాలు రైతులకు ఉపయోగ పడవు అంటే అటువంటి పరిశోధనలను ముట్టుకోవద్దని, ఆ పరిశోధనలు రైతులకు అవసరం లేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పండే ప్రతి ఉద్యాన పంటల వారీగా రాష్ట్రస్థాయి



మాట్లాడుతున్న డాక్టర్ దండ రాజి రెడ్డి

సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే పంటల వారీగా రైతులు చేపట్టవలసిన పనులతో ఉద్యాన పంటల క్యాలెండర్ రూపొందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. శాస్త్రవేత్తలు చేపట్టే పరిశోధనల ఫలితాలు రైతులకు క్షేత్రస్థాయిలో దిగుబడి పెంచేందుకు, నాణ్యత పెంపొందించేందుకు, అలాగే ఖర్చు తగ్గించేందుకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. ప్రతి అంశాన్ని సూక్ష్మ అంశాన్ని సైతం క్షుణ్ణంగా అధ్యయనం చేసే రైతులకు ఫలితాలు చేరవేయాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న మహిళ ఉద్యాన రైతులను దృష్టిలో పెట్టుకొని వారికోసం ప్రత్యేక ఉద్యాన మహిళ మేళలు నిర్వహిస్తామని తెలిపారు.


శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డిని సన్మానిస్తున్న వర్సిటీ బోధ నేతల సిబ్బంది

### కూరగాయల కొరతను అధిగమించేందుకు ప్రణాళికలు :

ప్రస్తుతం ఉన్న రాష్ట్రంలో కూరగాయల కొరతను అధిగమించేందుకు, భవిష్యత్తులో రాష్ట్ర కూరగాయల అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకమైన మేథో మధనం నిర్వహించి సమస్యను పరిశోధన, విస్తరణ సాంకేతికతతో పరిష్కరిస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న స్పెషలైజేడ్ యూనివర్సిటీలతో కలిసి పని చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. రైతులు సాగును లాభసాటిగా మార్చేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడేలా విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు ఉంటాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ భగవాన్, డీన్ డాక్టర్ ఎం రాజ శేఖర్, తూటా ప్రెసిడెంట్ డాక్టర్ జె చిన్న నాయక్, జనరల్ సెక్రెటరీ టి సురేష్ , కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీనివాసన్, ఎస్టేట్ ఆఫీసర్ నాగేశ్వర్ రెడ్డి , అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సైదయ్య, ప్రొఫెసర్లు, తూటా సభ్యులు, నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోతురాజు యాదయ్య, సభ్యులు విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం వెంటనే ఆపాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి

## ప్రభుత్వం ఫ్యాక్టరీ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలి

**గద్వాల(రాజోలి) నవంబర్ 2(నమస్తే ఉదయం):** రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామ శివారులో నిర్మించ తలపెట్టి న ఇథనాల్ పరిశ్రమను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి డిమాండ్ చేశారు.

శనివారం పరిశ్రమ నిర్మాణ స్థలాన్ని సిపిఎం జిల్లా కమిటీ బృందంతో కలిసి పరిశీలించారు. అక్కడ పంట పొలాలను, రైతులను పెద్ద ధన్వాడ గ్రామస్తులను కలిసి వారితో మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ... స్థానికంగా ఎలాంటి అనుమతులు లేకుండా పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమ నిర్మాణానికి పూనుకోవడం సరైనది కాదని కనీసం గ్రామపంచాయతీ అనుమతి కూడా తీసుకోలేదని తెలిపారు. 27 ఎకరాలు భూమి పరిశ్రమ కోసం సేకరించామని చెబుతున్న యాజమాన్యం కేవలం 6 ఎకరాల 29 గుంటలకు మాత్రమే నాలా పర్మిషన్ రెవెన్యూ డిపార్ట్మెంట్ దగ్గర తీసుకున్నారని తెలిపారు.

పరిశ్రమ నిర్మాణం కోసం సేకరించిన భూమికి ఆనుకుని గత ప్రభుత్వ హయాంలో దళితులకు ఇచ్చిన మూడెకరాల భూమి 156 ఎకరాలు ఉన్నదని ఆ భూమిలో దళితులంతా సాగులో ఉన్నారని పంటలు వేశారని ఆ భూమి మొత్తం కాలుష్యానికి గురవుతుందని,


కంపెనీ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

అలాగే 2009 సంవత్సరం వరదల సందర్భంగా చిన్నదన్వాడ గ్రామం ముంపుకు గురైన సందర్భంగా ఆ గ్రామ ప్రజలకు ఇంటి స్థలాల కొరకు సేకరించిన భూమి కూడా పరిశ్రమకు సేకరించిన భూమికి ఆనుకుని ఉన్నదని ఇలాంటి చోట ప్రభుత్వం ఎలా అనుమతులు ఇచ్చిందని ప్రశ్నించారు.

ప్రజల ఇబ్బందులను గమనించకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా పరిశ్రమ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం సరైనది కాదని అన్నారు.

పరిశ్రమ ఏర్పాటు అయితే వచ్చే ఇబ్బందులు ధ్వనికాలుష్యం, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం వీటివల్ల వచ్చే దుష్పరిణామాలు ఆరోగ్య సమస్యలు వీటన్నింటినీ పరిగణలోకి తీసుకోకుండా పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం ప్రజలను విస్మరించి కేవలం పెట్టుబడిదారులకు న్యాయం చేయడం కోసమే గతప్రభుత్వ వైఖరి ఉన్నట్లుగా అర్థమవుతుందని అన్నారు.

పరిశ్రమ ఏర్పాటు అయితే ఇబ్బందులు ఎదురవుతాయని తమ పచ్చటి పంట పొలాలు నాశనం అవుతాయని తుంగభద్ర నది నీళు కాలుష్యం అవుతాయని రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, ననసూరు, మాన్ దొడ్డి, చిన్న తాండ్రపాడు, నౌరోజీ క్యాంపు తదితర గ్రామాల ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారని ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు దగ్గర కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పార్లపల్లి దగ్గర నిర్మించిన ఇథనాల్ ఫ్యాక్టరీల పరిస్థితులు అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ఈ ప్రాంత ప్రజలు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని ప్రజల ఆందోళనను పరిగణలోకి తీసుకొని పరిశ్రమ యాజమాన్యం నిర్మించ తల్లి పెట్టిన పరిశ్రమను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పరిశ్రమ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు.

ఒకవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుమతులు ఇస్తూ మరోవైపు స్థానికంగా అదే పార్టీకి సంబంధించిన నాయకులు పరిశ్రమను వ్యతిరేకిస్తున్నామంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని నిజంగా ప్రజలపై ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వంతో ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయించాలని అన్నారు.

పర్యటన మరియు విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి తో పాటు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు, జి రాజు,ఏ పరంజ్యోతి, రమేష్, రాజోలి మండల సిపిఎం పార్టీ కార్యదర్శి ఆర్ విజయ్ కుమార్ ఉన్నారు.

# అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## ఓం స్వామియే శరణమయ్యప్ప...


## మణికంఠుని కృప కొరకు శబరిమల పాదయాత్ర

**నందిగామ, నవంబర్ 2 (నమస్తే ఉదయం):** నందిగామ మండలం అంతిరెడ్డి గూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు,ఎంబడి అంజి యాదవ్ స్వాముల బృందం పాదయాత్రను శనివారం ఉదయం షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. అయ్యప్ప స్వామి కరుణా కటాక్షంతో పాదయాత్ర విజయవంతం కావాలని అయ్యప్పను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు.

పాదయాత్రలో స్వాములు రవి, శేఖర్, ఎంబడి శేఖర్, అక్షయ్, అరుణ్‌లు. ఉన్నారు. పాదయాత్రను స్వాగతించిన వారిలో నందిగామ మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లె కుమారస్వామి గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, తుమ్మల నరసింహులు, కాంగ్రెస్ నాయకులు సీతారాం, ఆకుల జ్ఞానేశ్వర్, రాయికల్ శ్రీనివాస్, తదితరులున్నారు.

అయ్యప్ప స్వామి దేవాలయం నుండి పాదయాత్రలో శబరిమల వెళ్తున్న స్వాములకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్








# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు చేసిన మంత్రి

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండాలి: కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 2(నమస్తే ఉదయం):** జిల్లాలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ అన్నారు. శనివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న సమస్య తలెత్తకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని అన్నారు. సన్న రకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం దాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామాగ్రి వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డ రకం ధాన్యం, సన్న రకం ధన్యం కోనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని సూచించారు. జిల్లాలో రైస్ మిల్లర్ల తాలు, తేమ పేరుతో ఎటువంటి ధాన్యం కోతలు చేయవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని, రైతులకు ఎటువంటి నష్టం రావడానికి వీలు లేదన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసినందున, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్ర పరిచేందుకు అవసరం మేరకు ఇంటర్మీడియట్ గోడౌన్ లను సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో రైతులకు చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా బార్డర్ల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మీనారాయణ, జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ విమల, డి సి ఓ ప్రసాద్ రావు, వ్యవసాయ శాఖ, డిఆర్డిఓ శాఖల సహాయ అధికారులు పాల్గొన్నారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఐటి స్టడీ సెంటర్ విద్యార్థులు, అధ్యాపకులు

# డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ముఖ్యమంత్రికి అభినందనలు

### తెలంగాణ పేద ప్రజల ఆకాంక్షల కార్యసాధకుడు

### తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వాధినేత ఎనుముల రేవంత్ రెడ్డి

**రాజేంద్రనగర్, నవంబరు 2 (నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ బడుగు బలహీన వర్గాల విద్యార్థుల మహోజ్వల భవిష్యత్తుకై విద్యా వ్యవస్థను ప్రాథమిక స్థాయి నుంచి స్నాతకోత్తర స్థాయి వరకు విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో భాగంగా విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి. గురు కులాల బలపేతం నుండి జిల్లా, మండల, గ్రామీణ స్థాయి పాఠశాలల్లో నియామకాలు మొదలు . సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపన అనే ఒక వినూత్న ఆలోచనతో విద్యారంగంలో గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు.

అందరికీ నాణ్యమైన విద్యతో పాటు, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే సహృదయ సంకల్పంతో మరో అడుగు ముందుకు వేసి డైట్ మరియు కాస్మెటిక్ చార్జీలను పెంచి నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బడుగు వర్గాల విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేసిన శుభ సందర్భంగా ముఖ్యమంత్రికి, ఉపముఖ్య మంత్రికి, విద్యాశాఖ మంత్రికి మా టిజిటిడబ్ల్యూ ఐఐటీ స్టడీ సెంటర్ రాజెంద్రనగర్ కళాశాల విద్యార్థుల తరుపున హృదయపూర్వక అభినందనలు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము. అని హైదరాబాద్ రంగారెడ్డి సంగారెడ్డి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ సుధాకర్, టిజిటిడబ్ల్యూ ఐఐటీ స్టడీ సెంటర్ రాజెంద్రనగర్ ప్రధానాచార్యులు విజయరామిరెడ్డి, ఉపప్రధానాచార్యులు విజయేందర్ రెడ్డి, విద్యార్థులతో కలిసి ప్రజా ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు.

**డైట్ చార్జీలు: బాల బాలికలు**

3 నుంచి 7వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1330కు పెంపు
8 నుంచి 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు రూ.1100 నుంచి రూ.1540కు పెంపు
ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్థినీ విద్యార్థులకు రూ.1500 నుంచి రూ. 2100కు పెంపు

**కాస్మొటిక్ చార్జీలు:**

**బాలికలు**

3 నుంచి 7వ తరగతి విద్యార్థినులకు రూ.55 నుంచి రూ.175కు పెంపు.
8 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు రూ.75 నుంచి రూ.275కు పెంపు.

**బాలురు**

3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.62 నుంచి 150కు పెంపు
8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.62 నుంచి రూ.200కు పెంపు.





ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్,మహిళలకు రుణాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

# మహిళలను కోటీశ్వరులను ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే జీఎంఆర్

**కొత్తకోట, నవంబర్ 2(నమస్తే ఉదయం):** మహిళలను కోటీశ్వరులను చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో వరి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కొత్తకోట మండల మహిళా సమైక్య భవనంలో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు వడిలేని రుణాలను ఒక కోటి, రెండు లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తకోట మండలంలో ఇప్పటివరకు 13,కోట్ల రూపాయల రుణాలను మహిళలకు అందజేయడం జరిగిందని, ఈరోజు నాలుగు గ్రామాలకు కలిపి ఒక కోటి, రెండు లక్షల రూపాయలను మహిళలకు అందజేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో పది సంవత్సరాలుగా మహిళా సంఘాలకు రావాల్సిన రుణాలను రాకుండా చేసి మహిళలను ఇబ్బందులకు గురి చేశారని చెప్పారు. త్వరలో అమ్మ ఆదర్శ పాఠశాలను కూడా మహిళలకే అప్పజెప్పడం




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

జరుగుతుందని మహిళలను ఆర్థికంగా ఎదిగే దిశగా అన్ని రంగాలలో రాణించే విధంగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం కృషి చేస్తున్నారని అన్నారు.

హైదరాబాద్‌లో స్టాల్స్ ఏర్పాటు చేయబోతున్నామని మహిళలు తయారు చేసిన వస్తువులను స్టాల్స్‌లో మహిళలే అమ్ముకునే విధంగా ప్రోత్సహిస్తామనిఅన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లె ప్రశాంత్, సి. డి.సి చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, డి.ఆర్.డి.ఏ పిడి ఉమాదేవి, ఏపీ డి భాష, ఏపీ డి ఓ చెన్నమ్మ, ఏపిఎం, రాజశేఖర్ రెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు ప్రసన్న, మాజీ జెడ్పిటిసి డాక్టర్ పి జె బాబు,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు బీచుపల్లి, మేస్త్రి శ్రీను, వేముల శ్రీనివాసరెడ్డి,ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, రావుల జితేందర్ రెడ్డి,శేఖర్ రెడ్డి, రావుల సురేందర్ రెడ్డి, సంద వెంకటేష్,నవీన్ కుమార్ ,తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారులకు సమస్యలపై వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

### విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే

**మల్కాజిగిరి, నవంబర్ 2(నమస్తే ఉదయం):** విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు.

శనివారం మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని 9 డివిజన్లలో విద్యుత్ త్రీ ఫేస్, ట్రాన్స్ఫార్మర్ కొరత ఇతర కరెంట్ సమస్యలపై నియోజకవర్గ పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్ల డీ.ఈ, ఏడిఈ స్థాయి అధికారులతో కార్పొరేటర్లను, మాజీ కార్పొరేటర్లు స్థానిక నాయకులతో సమీక్షా సమావేశం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డి.ఈ అన్వర్ పాషా, సుబ్బారెడ్డి, ఎ.డి.ఈ.శ్రీనివాస్ రెడ్డి, చంద్ర శేఖర్ రామాచారి ఎ.ఈ.లక్ష్మీ, నాయకులు కార్పొరేటర్ విజయ శాంతి రెడ్డి, కరంచంద్, జగదీష్ గౌడ్, అనిల్ కిషోర్ గౌడ్, రాముయాదవ్, అమీనుద్దీన్, ఉపేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వంశీ ముదిరాజ్, ఇబ్రహీం మలేష్ గౌడ్, శరణగిరి తదితరులున్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదల వైద్యానికి వరం: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, నవంబర్ 2(నమస్తే ఉదయం):** సీఎం సహాయ నిధి పేదల వైద్యానికి వరం లాంటిదని మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం

మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో సి.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా వైద్య చికిత్స కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు డివిజన్ల వారీగా స్థానిక నాయకులతో కలిసి క్యాంపు కార్యాలయంలో తన చేతులమీదుగా చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో మచ్చ బొల్లారం డివిజన్ కు చెందిన
పి.మాధవి కి 60వేలు,
పి.పెంటయ్య కి 13,500,
అర్చనా యాదవ్ కి 36 వేలు,
అల్వాల్ డివిజన్ కు చెందిన
అనితా కి 60 వేలు,
అబ్దుల్ వాహబ్ 26500,
వెంకటాపురం డివిజన్‌కు చెందిన
పూజ కల్పన 60వేలు,
మోహన్ గోపాల్ కి 15 వేలు,
విజయమ్మ కి 48 వేలు,
నేరేడ్మెట్ డివిజన్ కు చెందిన
మాధవన్ కి 60 వేలు,
వినాయక్ నగర్ డివిజన్ కు చెందిన
పద్మ కి 15500, వీరమణి కి 45 వేలు,




వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

రత్న మాణిక్యం కి 32500,
సాయి కుమారు కి24 వేలు,
అనిల్ కుమార్ కి 25 వేలు,
హిమ బిందు కి 42వేలు,
శ్రీనివాస్ కి 60 వేలు,
మౌలాలి డివిజన్ కు చెందిన
నవీన్ కుమార్ కి 60 వేలు,
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కు చెందిన
నరసమ్మ కి 18 వేలు,
శోభ కి 36 వేలు,
మల్కాజిగిరి డివిజన్ కు చెందిన
జానకిరామ కి 39 వేలు,
గౌతమ్ నగర్ డివిజన్ కు చెందిన
రజనీ కి 36 వేలు,
రాజు కి 54 వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి అందజేశారు.



టీటీడీ బోర్డు చైర్మన్ బి.ఆర్ నాయుడును సన్మానిస్తున్న టిడిపి నాయకులు



టిటిడి బోర్డు మెంబర్ నర్సిరెడ్డిని సన్మానిస్తున్న టి టిడిపి అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వరరావు

# టిటిడి బోర్డు చైర్మన్, సభ్యులు సన్మానించిన టిడిపి నాయకులు

**రాజేంద్రనగర్, నవంబర్ 2(నమస్తే ఉదయం):** తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా నియమితులైన బి.ఆర్ నాయుడు, సభ్యులు నర్సిరెడ్డిని రాజేంద్రనగర్ సర్కిల్ టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

చైర్మన్ బి ఆర్ నాయుడు, పాలకమండలి సభ్యులు నర్సిరెడ్డిలను సన్మానించిన వారిలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడమ్ రామేశ్వరరావు, సోమవారం రాజ్ కుమార్, సనివెల్లి చంద్రశేఖర్ రెడ్డి, బాలరాజు, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733